# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



## 'ధరణి'తో దళారుల దుకాణం బంద్

గతంలో దళారులు తప్పుడు రిజిస్ట్రేషన్లు చేసుకునేటోళ్లు. ధరణి పోర్టల్‌తో రైతులకు ఎంతో మేలు జరిగింది. ఇప్పుడు తహసీల్ ఆఫీసులనే రిజిస్ట్రేషన్లు చేస్తున్నరు. ఇంతకుముందు భూమి కొన్నోళ్లు రిజిస్ట్రేషన్ కోసం వీఆర్వో, వీఆర్ఏ, పట్వారీ ఇట్లా ఆఫీసర్ల చుట్టూ తిరిగేది. పైసలియ్యందే పని అయ్యేది కాదు. ధరణి వచ్చినంక పని సులువైంది. అల్కగ రిజిస్ట్రేషన్లు అయితున్నయ్. దళారుల దుకాణం బందైంది. కాంగ్రెసోళ్లు అధికారంలోకి వస్తే ధరణి తీసేస్తం అంటుండ్రు. గింతమంచి పథకం తీసివేస్తే మళ్లీ పాత కష్టాలు వస్తయి. దళారుల రాజ్యం తెచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుట్రలు తిప్పికొడతం.

**- బైకని పరశురాములు, రైతు రగుడు (సిరిసిల్ల టౌన్)**



## ధరణి జెయ్యవట్టే మా భూములు మాకున్నయ్

మాకు అక్కపల్లిలో ఐదెకరాల భూమి ఉన్నది. మా తాతల పేరు మీదున్న భూమి నా పేరిట జెయ్యాలని నాడు ఎమ్మార్వో దగ్గరికిపోతే పట్వారీని కలువమన్నడు. పట్వారీని కలిస్తే రేపు మాపంటూ తిప్పుకొన్నడు. సార్లను కలిస్తే సిరిసిల్లకు పోయిండంటరు. తెల్లారిపోతే ఇగజేత్తం.. అగజేత్తమంటూ రోజులు గడిపిండ్రు. ఊరోళ్లంతా పట్వారీ చేతిలో ఏమైన్నా పెట్టుపనైతదన్నరు. ఎంతో కొంత ఇత్తానన్న చెయ్యలేదు. తిరిగితిరిగి యాష్టకొచ్చింది. తెలంగాణ వచ్చినంక కేసీఆర్ పుణ్యమా అని ధరణిని తెచ్చిండు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు పెట్టుకుంటే అద్ద గంటలో పాసుబుక్కు చెయ్యిల పెట్టిండ్రు. ఇన్నేళ్ల కాలం తిరిగినా కాని పని తెలంగాణ వచ్చినంక వెంటనే అయ్యింది. ధరణిజెయ్యవట్టి మా భూములు మాకున్నయ్. కాంగ్రెసోళ్లు అధికారంలోకి వస్తే ధరణి తీసేస్తమని చెబుతున్నరు. గింత మంచిగున్న ఈ పథకాన్ని తీసేస్తే మళ్ల పాత రోజులొత్తయ్. పైసలియ్యందే పని కాదు. ఒకరి భూములు వేరొకరి మీదకి రాత్తరు. మంచిగున్న రైతులను మళ్ల గోస పెడతరా?

**-పెండ్యాల బాల్‌రెడ్డి, అక్కపల్లి రాజన్న సిరిసిల్ల**

## దళారుల రాజ్యమైతది..

ధరణి పోర్టల్‌ను తీసేస్తే దళారుల రాజ్యం అవుతుంది. ఎన్నో ఏండ్ల నుంచి భూ సమస్యలను పరిష్కరించి, వాటిని పక్కా చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుంది. కాంగ్రెస్ హయాంలో కాగితాల మీద రాతలతో భూ యజమానులు ఎన్నో తిప్పలు పడ్డరు. కాంగ్రెస్ వస్తే



మల్ల రాత పుస్తకాలొస్తయి. అధికారుల ఇష్టారాజ్యం అయితది. రాత్రికిరాత్రే మార్పులు చేసి డబ్బులు గుంజుతారు. మళ్లీ ఏమైనా సమస్యలుంటే చెప్పులు అరిగేలా కార్యాలయాల చుట్టూ తిరగాలి. అప్పట్లో భూముల రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నా, మ్యూటేషన్లు కావాలన్నా నెలల తరబడి తిరగాల్సి వస్తుండేది. కానీ ధరణితో ఆ తిప్పలు తప్పినయి. ఎవరూ రికార్డుల్లో వేలు పెట్టకుండా అంతా ఆన్‌లైన్‌లోనే నడుస్తుంది. భూ యజమానులు సంతోషంగా ఉన్నరు. భూ సమస్యలు పరిష్కరించిన సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్నే మళ్లీ ఎన్నుకుంటాం. ఆగం చేస్తున్న కాంగ్రెస్‌ను బంగాళఖాతంలో కలుపుతం.

**- కామిడి సంజీవరెడ్డి (గంభీరావుపేట)**




# ధరణి ఎత్తివేస్తే దోపిడే

- మళ్లీ ఎనకటి 'కాలం' వస్తది
- పైరవీకారులు రాజ్యమేలుతరు
- లంచావతారులు పుట్టుకొస్తరు
- పహాణీ కావాలన్నా కాళ్లరిగేలా తిప్పకుంటరు
- రైతులను కాంగ్రెస్ ముంచాలని చూస్తున్నది
- ఆ పార్టీ నాయకులను నమ్మేది లేదు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతన్నలు

కరీంనగర్, నవంబర్ 21(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : గతంలో భూమి హక్కులకు సంబంధించి అనేక రికార్డులు ఉండేవి. ముఖ్యంగా రెవెన్యూ అధికారుల చేతుల్లో 11 రకాల రికార్డులు నిర్వహించేవారు. ప్రభుత్వ, ప్రైవేట్, రైతు ల భూములు ఇలా అన్ని రకాల భూముల వివరాలు వాళ్ల చేతుల్లోనే ఉండేవి. ఒక్కో రికార్డులో మళ్లీ పదుల సంఖ్యలో కాలమ్స్ ఉండేవి. అధికారులే రాతపద్ధతిలో ఆ లెక్కల్లో మార్పు లు, చేర్పులు చేసేవాళ్లు. ఇక్కడే విచ్చలవిడి అవినీతి జరిగేది. ముఖ్యంగా పహాణీలో అక్రమాలకు అంతులేకుండాపోయింది. బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకు వచ్చిన ధరణిలో ఉన్న రికార్డులో మార్పులు, చేర్పులు చేసే అధికారాన్ని కిందిస్థాయి అధికారులకు లేకుండా చేసింది. ఏదైనా సమస్య ఉంటే రైతు దరఖాస్తు పెట్టుకున్న తర్వాత.. కలెక్టర్ మాత్రమే పరిశీలించి మార్పు చేసే అవకాశం కల్పించింది. గతంలో మాదిరిగా వీఆర్వోలు, ఆర్ఐలు, ఎమ్మార్వోలు, ఆర్డీవోలు ఇష్టం వచ్చినట్టు రికార్డులు మార్చే సంస్కృతికి చరమగీతం పాడింది. ఏకంగా వీఆర్వో వ్యవస్థను రద్దు చేసింది. అయితే, ఇటీవల కాంగ్రెస్ నాయకులు ధరణిని రద్దు చేసి పాత పద్ధతినే తెస్తామని చెబుతుండడంతో రైతుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. పాత పద్ధతి తెస్తే మళ్లీ రైతులు భిక్షమెత్తుకోవాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. పైరవీకారులు రాజ్యమేలుతారని, లంచావతారులు పుట్టుకొస్తారని, ఏ చిన్న పనికైనా అధికారులు తమ చుట్టూ ఏండ్ల తరబడి తిప్పుకొంటారని, రికార్డులు తారుమారు చేసి ఒకరికొకరికి మధ్య పంచాయితీలు పెట్టిస్తారని వాపోతున్నారు. కాంగ్రెస్ నాయకులు రైతులను ముంచాలని చూస్తున్నరని మండిపడుతున్నారు. ఎట్టి పరిస్థితిలోనూ వారిని నమ్మేది లేదని, తప్పకుండా బుద్ధి చెప్తామని స్పష్టం చేస్తున్నారు.

## మునుపు పైసలేకుంట పనయ్యేది గాదు.

ఇంతకుముందు వీఆర్‌వోలు, వీఆర్ఏలు ఉన్నప్పుడు తాసిలాఫీసుకువోతే పైసలేకుంట పనయ్యేది గాదు.



పాసుబుక్కు, మ్యుటేషన్ కోసం సార్ల చుట్టూ తిరిగి, తిరిగి యాష్టకువచ్చేది. తెలిసినోల్లతోటి చెప్పించుకుంటే ఇన్ని పైసలిచ్చి పనిజేపిచ్చుకునే దరిద్రం ఉండేది. ఇప్పుడు అసోంటి గోసలులేవు. గంటలకొద్ది రిజిస్ట్రేషన్ కోసం ఎదురు సూసుడులేదు. పాస్‌బుక్ ఇంటికే డైరెక్ట్ వస్తున్నది. మునుపు పైసలిత్తే ఒగోల్ల భూమి మల్లొక్కల మీద మార్చిడి అయ్యి చిన్నచిన్నోల్లు ఎన్నో ఇబ్బందులుపడ్డరు. ఇప్పుడు అటువంటి బాధలు లేకుండా ధరణి రైతుకు మేలు జేసింది.

**-రామకృష్ణారెడ్డి, రైతు (ఎల్లారెడ్డిపేట)**

## ధరణితో రైతులకు మేలు

ధరణితో రైతులకు ఎంతో మేలు జరుగుతాంది. ఈ పోర్టల్‌తో తహసీల్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ వెంటనే అయితంది. నా పేరు సుమంత్ వినోద్ నేను కొనుగోలు చేసిన 18 గుంటల భూమికి స్లాట్ బుక్ చేసుకున్న. తహసీల్ ఆఫీసులో పది నిమిషాల్లో భూమిని పట్టా చేసి, పాస్‌బుక్‌లో భూమికి సంబంధించిన వివరాలు ఎక్కించిన్రు. ధరణి



తీసివేస్తామంటూ కాంగ్రెస్ అంటున్నది. వాళ్లను అవకాశం ఇస్తే రైతులు మళ్లీ ఇబ్బందిపడుతరు. గతంలో రెండెకరాల భూమి పట్టా చేసుకునేందుకు రోజంత వెచ్చించి 25కిలోమీటర్ల దూరం వెళ్లి వేములవాడలోని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి పోయిన. అక్కడ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకొని డాక్యుమెంట్లను తహసీల్ కార్యాలయంలో తమ పేరు మీద ఎక్కించుకోవడానికి నానా తిప్పలు పడిన. భూములు పట్టా చేయించుకునేందుకు వీఆర్వో సార్ల దగ్గరికి ఎన్ని రోజులు తిరిగినా పని కాకపోయేది. గిప్పుడు ధరణితో భూముల పట్టాలు అద్ద గంటలోనే అయితున్నయి.

**- సుమంత్ వినోద్, రైతు (రుద్రంగి)**

## దళారీ రాజ్యానికి పురుడుపోసినట్లే

కాంగ్రెస్ ప్రభుత్వానికి అధికారం ఇస్తే దళారీ రాజ్యానికి పురుడుపోసినట్లే. తెలంగాణలో ఎన్నికలు ఉన్నయి కాబట్టే భూమాత అంటున్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలోనైనా భూమాత ఉన్నదా.. కాంగ్రెస్ నాయకులు కమిషన్ల కోసమే ధరణి తీసేస్తామంటున్నరు. ఇదే జరిగితే మళ్లీ పాత రోజులు రావడం ఖాయం. రెవెన్యూ రికార్డులు, కౌలుదారు, అనుభవదారు కాలమ్ పెట్టి రైతులను నట్టేట ముంచుతరు. ధరణితో రైతుల వ్యవసాయ భూములు రిజిస్ట్రేషన్లు, పట్టా మార్పిడి సులభమైతది. ఇప్పుడు మా భూమిపై మాకే హక్కు కల్పించిన్రు. పది నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్లు అయితున్నయి. ధరణిని కాపాడుకునేందుకు కాంగ్రెస్‌ను తరిమికొట్టాలి.

**-గుజ్జుల అంజిరెడ్డి, రైతు, అడవిపదిర (వీర్నపల్లి)**





## ఆనాటి కష్టాలు మాళ్ల రావొద్దు...

మా బాపు చిన్నప్పుడే పాణం మంచిగ లేక చనిపోయిండు. నేను పదహారేండ్ల నుంచే ఎవుసం చేస్తున్న. మా భూమిలో వరి, మక్క, పెసర్లు, మిర్చి పండించేది. చెరువు కింద బాయిల నీళ్లు ఉన్న కరెంటు లేకపోవడంతో పంటలకు నీళ్లందకపోయేవి. అప్పుడు బాయికి మూడు హెచ్‌పీల మోటరు పెట్టుకొని పొలం పారించేది. ఆ మోటరుకే కరెంటు అచ్చుకుంటపోతే మోటరు ఏడాదికి ఐదారుసార్లు కాలుతుండేది. గంట పాటు వచ్చే కరెంటుకు పొద్దు గూకినంక పోతే పొద్దచ్చేదాక కరెంటు కాడానే పురుగు పూసిలో పండుకునేటోళ్లం. గంట నడిచేది చిటుక్కుమని మళ్ల పోయేది. గలుమలకేయి నీళ్లు పోయి కోస మడి పారక పోయేది. కేసీఆర్ సారు అచ్చినంక కరెంటు తిప్పలు తప్పినయ్. 24గంటల కరెంటు ఇస్తాన్నడు. పంట కోసినంక గవర్నమెంటే వడ్లను కొంటున్నది. కానీ కాంగ్రెసోళ్లు 10హెచ్‌పీ మోటరు పెడితే మూడు గంటలకే పొలం పారుతదని పాయిదలేని మాటలు అంటున్నరు. ఎవుసం గురించి తెలిసినోళ్లకు రైతుల బాధలు, కరెంటు కష్టాలు తెలుస్తయి. తెలువనొడికి ఓటేస్తే ఏనకటి కష్టాలు మళ్లొస్తయి. అలాంటి గోస రాకుండా ఉండాలంటే కేసీఆర్ సారుకు ఓటేయాలని కోరుతున్న.

**- గొల్కొండ చంద్రమౌళిరెడ్డి, రైతు (కోనరావుపేట)**

## 10హెచ్‌పీ మోటర్లు పెడితే బోర్లు ఎండిపోతయి

నా పేరు గద్దెరాజి రాజం. నాకు రెండెకరాల వ్యవసాయ భూమి ఉన్నది. ఆనాడు కరెంట్ కష్టాలతో బోర్లు, బావుల్లో నీరున్నా పంటలు ఎండిపోయినయి. కాంగ్రెస్ గవర్నమెంటులో కరెంట్ ఇప్పుడు వస్తదో అని ఎదురుచూసేటోళ్లం. ఆ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే తెల్లందాకా పొలాలకాడ పడిగాపులు కాయాల్సిందే. వ్యవసాయ భూములు మళ్లీ పడావుపడుతయి. రేవంత్‌రెడ్డి మూడు గంటల కరెంట్ సరిపోతది అంటుండు. దాంతో ఒక మడి కూడా సరిగ్గా పారదు. మా లాంటి చిన్నకారు రైతులు 10హెచ్‌పీ మోటర్లు కొనాలంటే చానా ఇబ్బందిపడుతరు. ట్రాన్స్‌ఫార్మర్ల మీద లోడు పడి కాలిపోతయి. సీఎం కేసీఆర్ పుణ్యమా అని 24గంటల కరెంట్ వస్తున్నది. ఎప్పుడూ పడితే అప్పుడు పొలాలని నీళ్లు పారబెట్టుకుంటున్నం.




**-గద్దెరాశి రాజం, రైతు (వీర్నపల్లి)**

# నువ్వద్దు.. నీ కరెంటద్దు

## కాంగ్రెస్‌ను నమ్మితే నిండా మునుగుడే

- యాభై ఏండ్లలో చేసిందేమీ లేదు
- ఇప్పుడొచ్చి మళ్లీ మాయమాటలు చెబుతున్రు
- స్పష్టం చేస్తున్న రైతులోకం



కరీంనగర్, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'కాంగ్రెస్ మొదటి నుంచి రైతు వ్యతిరేకిగా ఉన్నది. యాభై ఏండ్లకుపైగా పాలించినా రైతులకు చేసిందేమీలేదు. కరెంట్ సక్కగా ఇయ్యలె. నీళ్లు సక్కగా ఇయ్యలె. పంటలు ఎండిపోతున్నా పట్టించుకోలె. ఆఖరుకు అప్పుల బాధతో సచ్చిపోయినా ఆదుకోలె. మళ్లీ ఆ పార్టీ నాయకులు ఇప్పుడొచ్చి మాయమాటలు చెబుతున్రు. బీఆర్ఎస్ సర్కారు 24గంటల కరెంట్ ఇస్తాంటే.. మేమేదో చేస్తామంటూ నమ్మించే ప్రయత్నం చేస్తున్రు. మమ్మల్ని ఆగం చేయాలని చూస్తున్రు. మళ్లీ మేం మోసపోం. మా బతుకుల్లో మట్టి పోసుకోం' అని జిల్లా రైతులు స్పష్టం చేస్తున్నారు. బీఆర్ఎస్ సర్కారు రైతుల కోసం 24 గంటల కరెంట్, సాగునీరు, రైతుబంధు, రైతు బీమా ఇస్తున్నదని, అన్నదాతలు ఇప్పుడిప్పుడే సంతోషంగా బతుకున్నారని చెబుతున్నారు. కానీ, కాంగ్రెస్ ఓర్వలేకపోతున్నదని, అందుకే కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదని, మంచి పథకాలను రద్దు చేస్తామంటున్నదని మండిపడుతున్నారు. ఎన్నికల్లో ఎలాగైనా లబ్ధిపొందాలన్న ఉద్దేశంతో అబద్ధపు హామీలు, ఝూటా మాటలు చెబుతున్నదని విమర్శించారు. కర్ణాటకలో అలాగే చెప్పి నిండా మోసం చేసిందని, ఇప్పుడు ఇక్కడ ఇలాగే చేయాలని చూస్తున్నదన్నారు. కరెంట్‌పై పూటకోమాటతో పరేషాన్ చేస్తున్నదని, ఓసారి 3గంటల కరెంట్ సరిపోతుందని, అదెలా సాధ్యమంటే 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని అంటున్నారని మండిపడుతున్నారు. అసలు వ్యవసాయ బోర్లకు ఆ మోటర్లు పెట్టుకుంటారా..? ప్రశ్నించారు. అవి పెట్టాలంటే ఒక్కో రైతుపై లక్షకుపైగా ఖర్చవుతుందని, ఆ పైసలు వాళ్ల ఇంట్ల నుంచి ఇస్తారా..? అని ధ్వజమెత్తారు. పెద్ద మోటర్లు పెట్టుకుంటే కరెంటు సరిపోతదా..? బావుల్లో, బోర్లలో నీళ్లు ఊర్తయా..? నీటి ప్రెషర్‌ను పైపులు తట్టుకుంటయా..? లోడ్ పడి ట్రాన్స్‌ఫార్మర్లు ఉంటయా..? అని ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి ఎద్దెర్కనా..? ఎవుసమెర్కనా..? నిలదీస్తున్నారు. సమైక్య రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో తాము ఎదుర్కొన్న చీకటి కష్టాలు మళ్లీ వద్దని రైతన్నలు ముక్తకంఠంతో స్పష్టం చేస్తారు. ఈ కాంగ్రెసోళ్లు మా బతుకులు ఆగం చేయాలని చూస్తున్నారని, వాళ్ల మాటలతో మోసపోమని స్పష్టం చేస్తున్నారు. రైతుకు అన్ని విధాలా అండగా నిలిచిన బీఆర్ఎస్ సర్కారునే మళ్లీ గెలిపించుకుంటామని చెబుతున్నారు.

## పుట్లకొద్ది వడ్లు పండుతున్నయి

గతంలో ఎవుసమంటే దుఖంవచ్చేది, కరెంటు కోసం పొద్దుమాపు బావులకాడనే ఉండేది. పురుగుపూసి వచ్చిన భయపడుకుంటూనే కరెంటు కోసం ఎదురు చూసేటోళ్లం. రేయింబవళ్లు కష్టపడినా.. పంట చేతిరాక చేసిన అప్పులు పెరిగేవి. సీఎం కేసీఆర్ పాలనలో 24 గంటల కరెంటు ఇస్తున్నడు. పుష్కలంగా నీళ్లు వత్తున్నయి. రైతులందరూ సంతోషంగా ఎవుసం చేస్తున్నరు. పుట్లకొద్ది వడ్లు పండుతన్నయి. మళ్లీ గిప్పుడు గా కాంగ్రెసొళ్లు వచ్చి మూడు గంటలే ఇస్తామంటున్నరు. వాళ్లకు అవకాశం ఇవ్వవద్దు. కేసీఆర్ సారునే మళ్ల గెలిపించుకోవాలె.

**- ఎడ్ల రమేశ్, రైతు (ముస్తాబాద్)**





## బాయిలకాన్నే పడుకొనేటోళ్లం..

నా పేరు కస్తూరి రాజిరెడ్డి. మా అయ్య పాణం మంచిగ లేకపోతే మా తమ్ముళ్లను పట్టుకొని పద్నాలుగేండ్ల పిలగాడి నుంచి ఎవుసం చేస్తున్న. మాకు ఆ కాలంలో పదిహేను ఎకరాల భూమి ఉండే. అందులో మూడెకరాల్లోనే పంట వేసేది. మిగతాది బీడు ఉండే. తెలంగాణ రాకముందు నేను కాంగ్రెస్ పార్టీలో పని చేసిన. నీటి పారుదల శాఖ చైర్మన్‌గా గ్రామ, మండలాధ్యక్షుడిగా తొమ్మిదేండ్లు చేసిన. ఏనాడు కూడా సక్కగా పంట పండలె. పొద్దుగూకి సరికే ఓ చేతిలో కట్టె పట్టుకొని జేబులో జకముక పెట్టుకొని బాయికాడికి పోయేది. ఒడ్ల మీద, బాయి గడ్డ మీద చెద్దరి వేసుకొని పడుకొనేది. పురుగుపూసి వచ్చిన భయపడుకుంటూనే కరెంటు కోసం ఎదురు చూసేటోళ్లం. రేయింబవళ్లు కష్టపడిన పంట చేతిరాక చేసిన అప్పులు పెరిగేవి. ఏడాదికి నాలుగు, ఐదు మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయేవి. ఏం చేయాల్నా తోచక బీడు భూములలో ఆవులు, ఎడ్లు కాసుకొని బతికినం. కానీ తొమ్మిదేండ్ల కింద కోనరావుపేటలో కేసీఆర్ సభ పెడితే ఊళ్లో అందరినీ తోలుకపోయిన. మనం మంచిగ బతకాలంటే సారు పాలన రావాలని అనుకున్నం. సారు అప్పుడు చెప్పిన మాటలన్నీ నిజంజేత్తుండు. 24గంటల కరెంటు ఇత్తాండు. నాకున్న పదిహేను ఎకరాలు ఇప్పుడు సాగు చేస్తున్న. పుట్లకొద్ది వడ్లు పండుతున్నయి. వడ్లు ఎక్కడ పొద్దామన్న సందులేదు. కాంగ్రెసోళ్లు చేయని పనులన్నీ కేసీఆర్ సారు చేసి చూపించిండు. మనోళ్లు మనకైతెరు.. మళ్లీ ఇదే సర్కారు కొనసాగాలె.

**- గొల్కొండ చంద్రమౌళిరెడ్డి, రైతు (కోనరావుపేట)**



## రైతులు మంచిగ ఉండుడు.. కాంగ్రెసోళ్లకు ఇష్టంలేనట్లుంది.

రైతులు మంచిగ ఉండుడు కాంగ్రెసోళ్లకు ఇష్టంలేనట్టుంది. ఇప్పుడే 10హెచ్‌పీ మోటర్లు పెడుతమని అంటున్నరు. రైతులందరూ ఒకేసారి పది హెచ్‌పీ మోటర్లు పెడితే ట్రాన్స్‌ఫార్మర్లు పేలుతయి. రిపేర్లు చేయడానికే చానా సమయమైతది. పంటలు ఎండిపోతయి. కరెంటు కష్టాలొస్తయి. కథ మళ్లీ మొదటికే వత్తది. రైతులు ఎప్పటి నుంచో మూడు, ఐదు హెచ్‌పీల మోటర్లే వాడుతున్నరు. కాంగ్రెస్‌వాళ్లు అన్నట్లు 10హెచ్‌పీ మోటర్లు పెట్టే ముచ్చట కలువని పని. కేసీఆర్ సారు రైతులకు కష్టం కలుగకుండా 24గంటల కరెంటు ఇయ్యవట్టే. గిప్పుడు మళ్ల కూడా ఆ సారునే గెలిపించుకుంటం.

**- లింగారెడ్డిగారి రాజేశ్వర్‌రెడ్డి, రైతు (గంభీరావుపేట)**



## పది గుంటలన్న పారుతదా..

మాది పోతుగల్ గ్రామం. నేను చిన్నకారు రైతును. కాంగెస్‌వాళ్లు మూడు గంటల కరెంటే ఇస్తామంటున్నరు. ఆ మూడు గంటలతోటి ఎవుసం చేయడం చానా కష్టం. పది గుంటల మడి కూడా తడవదు. గతంలో కరెంటు కోసం తంటాలు పడినం. నీళ్లు, కరెంటు లేక ఎవుసం బంజేసినం. తెలంగాణలో కేసీఆర్ వచ్చినంక రైతులకు మంచిగజేస్తుండు. కరెంటు, నీళ్ల గోసలేదు. మళ్లా కేసీఆర్‌ను గెలిపించుకోవాలె.

**- వరి రాజిరెడ్డి, రైతు, పోతుగల్ (ముస్తాబాద్)**

## కరెంటు లేక వలసపోయిన్రు



రేవంత్‌రెడ్డి ఎవుసానికి మూడు గంటల కరెంటే చా లంటున్నడు. 10హెచ్‌పీ మోటర్లు పెడుతామంటున్న డు. గీ పని అయ్యేదేనా. మంచిగున్న రైతులను ఆగం చేసేందుకే ఆయన ఇష్టమచ్చినట్టు మాట్లాడవట్టే. మూడు గంటల కరెంటుతో ఒక మడన్న పారుతదా. కాంగ్రెస్ పాలనల నీళ్లు, కరెంటు లేక భూములు అమ్ముకొని చానా మంది వలసకు పోయిన్రు. తెలంగాణ వచ్చినంక కేసీఆర్ సారు 24గంటల కరెంటు ఇయ్యవట్టే. పుష్కలంగా నీళ్లు ఇస్తాండాయె. గిప్పుడు చానా మంది ఊళ్లలో ఎవుసం చేస్తున్నరు. సంతోషంగా ఉన్నరు.

**- బూర ఎల్లయ్య, రైతు, రగుడు (సిరిసిల్ల టౌన్)**

## పంట చేతికచ్చేదాకా నమ్మకంలేకుండె..



మాది కొత్తపల్లి. మా ఊరి శివారులో రెండెకరాల పొలం ఉన్నది. తెలంగాణ రాక ముందు చేను నీళ్లు పెట్టేందుకు వచ్చిరాని కరెంటు కోసం బావికాడనే పడిగాపులు కాసేది. అక్కడే తిని, పడుకునేది. అయినగాని వరి పంట చేతికి వచ్చే ముందు కరెంటు లేక కొంత ఎండిపోయేది. పంట చేతికచ్చేదాకా నమ్మకంలేకుండె.. కరెంటుషాకులు, పాముకాట్లతో చానా మందే సచ్చిపోయిన్రు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని రాత్రిపూట పొలంకాడికి పోయేది. తెలంగాణ వచ్చినంక కేసీఆర్ సారు జేయ్యవట్టి 24గంటల కరెంటు వస్తాంది. రందీ లేకుండా ఎవుసం చేసుకుంటున్నం.

**- ఎలుక కొమురయ్య, రైతు. కొత్తపల్లి (గంభీరావుపేట)**

## కరెంటు కోసం గోసపడ్డం..



ఇంతకు ముందు సింగసముద్రంల, బోర్లల్ల నీల్లున్నప్పుడు గూడ కరెంటు కోసం మస్తు గోసపడ్డం. నాకు గ్యాస్ గోదాం కాడ ఐదెకరాల పొలం ఉన్నది. తెలంగాణ రాక ముందు కరెంటు కోసం ఎప్పుడు పొలంకాడనే ఉండేటోడిని. గంటకోసారి వచ్చే కరెంటుతో మస్తు గోసపడ్డం. తీరా పంటలు ఎండిపోయేటివి. తెలంగాణ వచ్చినంక కేసీఆర్ సారు 24గంటలు ఇయ్యవట్టె. రైతులకు గింతగూడ ఇబ్బందిలేకుండ అయింది. రైతులకు ఏమన్న మేలు జరిగిందంటే కేసీఆర్ సారుతోటే అయ్యింది. గాని ఎవ్వలు గూడ ఇంత మంచి పనులుజెయ్యలేదు.

**- సాదు వెంకట్‌రెడ్డి, రైతు (ఎల్లారెడ్డిపేట)**